ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం, 6 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM




## కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 6 (ప్రజాస్వరం): భారాసకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు ఆయన జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవలే ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే.



# జీహెచ్‌ఎంసీలో రగడ

- కౌన్సిల్లో కార్పొరేటర్ల ఆందోళన
- మేయర్ విజయలక్ష్మి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- ప్లకార్డులతో నిరసన
- బీజేపీ, మజ్లిస్ సభ్యుల బాహాబాహీ

హైదరాబాద్, జూలై 6 (ప్రజాస్వరం): మహానగర వాసులకు అత్యవసరమైన సేవలు అందించే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం రాజకీయ నిరసనలకు వేదికగా మారింది. బీఆర్ ఎస్ సభ్యుల ఆందోళనలు, కాంగ్రెస్, బీజేపీ సభ్యుల తోపులాటలతో రసాభాసగా మారింది. శనివారం ఉదయం 10:30 గంటలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. వెంటనే టాక్స్ కలెక్షన్ ఫుల్లు.. అభివృద్ధి నిల్ అంటూ బీజేపీ సభ్యులు ఆందోళన ప్రారంభించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించరాదని బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులతో పోటాపోటీగా మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన మేయర్ సమావేశాన్ని 15 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సభలో ప్రారంభించగానే మజ్లీస్, బీజేపీ కార్పొరేటర్ల మధ్య తోపులాట జరిగింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా జోక్యం చేసుకోవడంతో సభలో ఏం జరుగుతుందన్న అయోమయం నెలకొంది.

ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ కాంగ్రెస్ కార్పొరేటర్లు ఒకరు ఒకరు తోసుకున్నారు. ఈ గలాటలో బీజేపీ, మజ్లీస్ కార్పొరేటర్లు పరస్పరం దాడికి దిగినంత పని చేశారు. అంతలో మార్షల్స్ రంగ ప్రవేశంచేసి వారిని బయటికి పంపించే ప్రయత్నం చేయగా బీజేపీ కార్పొరేటర్లు మార్షల్స్ పై విరుచుకుపడ్డారు. ఆ తర్వాత దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత, సీనియర్ కాంగ్రెస్ లీడర్ డి.శ్రీనివాస్ మృతి పట్ల మేయర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా కార్పొరేటర్లు ఆమోదించారు.

### మేయర్ కు నిరసన

మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇటీవలే బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. దీనిపై నేడు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో రసాభాస చోటు చేసుకుంది. సమావేశం ప్రారంభమైన కొద్ది సేపట్లోనే బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ విజయలక్ష్మి రాజీనామా చేయాలని ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. మేయర్ తీవ్ర ఆగ్రహానికి గురై సీట్లోంచి లేచి వెళ్లిపోయారు. సమావేశాన్ని 15 నిమిషాలు వాయిదా వేశారు.



మేయర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న సభ్యులు

### ఫిరాయింపులను ప్రోత్సహించింది మీరే : మేయర్

కౌన్సిల్ సమావేశాన్ని మేయర్ ప్రారంభించగానే బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులతో లేచి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించరాదని నినాదాలు చేశారు. దీనిపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది ఎవరు మీకు తెలియదా మీకు సిగ్గు లేదు అని మేయర్ గద్వాల విజయలక్ష్మి బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### తీవ్ర ఉద్రిక్తత

జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో పెద్ద ఎత్తున రభస చోటు చేసుకుంది. అంతకు ముందు ప్రధాన కార్యాలయం వద్ద నుంచే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్ల ఆందోళనలతో జీహెచ్ఎంసీ దద్దరిల్లింది. బీఆర్ఎస్ నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనలో పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ ముందు ప్లకార్డులు పట్టుకొని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు ఆరోపణలు చేసుకున్నారు. ఆ తరువాత సమావేశం ప్రారంభమయ్యాక కూడా రచ్చ కొనసాగింది. మేయర్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియంను చుట్టుముట్టారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. నిరసన తెలిపేందుకు బీఆర్ఎస్‌కు సిగ్గుండాలంటూ మండిపడ్డారు. 15 నిమిషాల పాటు సమావేశాన్ని వాయిదా వేశారు. మేయర్ విజయలక్ష్మి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక తర్వాత జరుగుతున్న మొదటి సమావేశం కావడంతో పెద్ద ఎత్తున రచ్చ జరుగుతోంది. బీఆర్ఎస్ కార్పొరేటర్ల మద్దతుతో గద్వాల్ విజయలక్ష్మి, మోతె శ్రీలత మేయర్, డిప్యూటీ మేయర్ అయ్యారు. వీరిద్దరూ పార్టీ మారడంతో మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. పైగా మేయర్, డిప్యూటీ మేయర్ ఇద్దరూ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు.

## ఇంద్రకీలాద్రిలో ఆషాడ మాస పూజలు

దుర్గమ్మకు తొలిసారెను సమర్పించిన వైదిక కమిటీ



విజయవాడ, జూలై 6 (ప్రజాస్వరం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ సన్నిధిలో ఆషాడ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు నుంచి ఆగస్టు 4 వరకు ఈ మాసోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వైదిక కమిటీ సభ్యులు తొలిసారెను సమర్పించారు. మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారికి కమిటీ సభ్యులు సారెను సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, చలిమిడి, గోరింటాకును భక్తులు సమర్పించారు. ఆషాడ మాసం తొలిరోజు కావడంతో ఇంద్రకీలాద్రి భక్తులతో కిక్కిరిసింది.

### భక్తుల సందడి

ఆషాడ మసోత్సవాల సందర్భంగా నెలరోజుల పాటు ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడనుంది. అలాగే అమ్మవారికి శివ స్వామి సారెను సమర్పించారు. 116 మంది భక్తులతో కలిసి వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆషాడ మాసం నెలరోజుల పాటు అమ్మవారికి భక్తులు సారెను సమర్పించనున్నారు. ఆషాడ మాసోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మను సారెను సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.





## చంద్రబాబుకు లేఖ రాస్తా

### బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 6 (ప్రజాస్వరం): రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ వేళ బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుమల పవిత్రతను కాపాడాలని ఏపీ ముఖ్యమంత్రికికి బహిరంగ లేఖ రాయబోతున్నట్లు లక్ష్మణ్ చెప్పారు. శనివారం శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కేంద్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజున హామీలపై సామరస్య మార్గంలో పరిష్కరించుకోవలని కోరుకుంటున్నామన్నారు. సమస్యలన్నీ చర్చల ద్వారా సానుకూల వాతావరణంలోనే పరిష్కరించబడుతాయ తప్ప ప్రజలను ప్రాంతీయ తత్వం పేరుతో రెచ్చగొట్టి రాజకీయంగా పబ్బం గడపడం భావ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడిందని, మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే బీజేపీ వ్యతిరేకమని చెప్పారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత మోడీ జమ్మూ కాశ్మీర్ ప్రజలకు రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. మోడీ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు.

### సాంకేతిక లోపంతో నిలిచిపోయిన
## ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్

నల్గొండ, జూలై 6 (ప్రజాస్వరం): నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే స్టేషన్ లో సాంకేతిక లోపంతో రైలు నిలిచిపోయింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హౌరా నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న ఫలక్ నుమా ఎక్స్ ప్రెస్ మిర్యాలగూడ స్టేషన్ వద్దకు రాగానే లగేజీ బోగిలో సాంకేతిక సమస్య ఏర్పడింది. సుమారు రెండు గంటలకు పైగా రైలును నిలిపివేసి సమస్యను గుర్తించి మరమ్మతు చేశారు. అనంతరం రైలు బయలుదేరి సికింద్రాబాద్ వెళ్లింది. రైలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు.





## తెలంగాణ నుంచి సింఘ్వీ!

### మీడియాతో చిట్ చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి హింట్

### కేశవరావుకు కేబినెట్ హోదాతో ప్రత్యేక సలహాదారు పదవి

హైదరాబాద్, జూలై 6, (ప్రజాస్వరం): తెలంగాణలో రాజ్యసభ సీటు ఎవరికి దక్కనుంది? తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు ఆ సీటు ఇస్తారా? లేకా సీనియర్లకు ఇస్తారా? ఇదే చర్చ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో మొదలైంది. రాజ్యసభ సభ్యత్వానికి కే కేశవరావు రాజీనామా చేయడంతో ఆ సీటు ఎవరికి ఇస్తారన్న దానిపై నేతలు చర్చించుకోవడం మొదలైంది. తెలంగాణకు చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడవాళ్లకు సీటు ఇవ్వడం ఖాయమన్నది కొందరి నేతల వాదన. కానీ ఈ సీటును పార్టీలోని కీలక నేతకు ఇవ్వాలని కాంగ్రెస్ హైకమాండ్ ఆలోచన చేస్తుందనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఏఐసీసీ అధికార ప్రతినిధి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి ఆ సీటు ఇవ్వడం ఖాయమంటూ వార్తలు వస్తున్నాయి.పార్టీ హైకమాండ్ ఆయనకు దాదాపుగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్ లో టాక్. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో అభిషేక్ మనుసింఘ్వీ అనుకోకుండా ఓటమి పాలయ్యారు. దీంతో ఆయనను మరో చోట నుంచి పెద్దల సభకు పంపాలని భావిస్తోంది. ఈ సమయంలో బీఆర్ఎస్ నుంచి కేశవరావు కాంగ్రెస్ లోకి వచ్చారు. కేకే రూపంలో సింఘ్వీకి అదృష్టం కలిసి వచ్చిందని అంటున్నారు.ఇప్పటికే కేకే తన రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కడ్ కు అందజేశారు. ఒక పార్టీ నుంచి పదవి పొంది మరో పార్టీలో చేరినప్పుడు రాజీనామా చేయడం నైతిక బాధ్యతను ఆ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ లో చేరిన సీనియర్ నేత కేశవరావుకు కేబినెట్ హోదాతో కూడిన ప్రత్యేక సలహాదారు పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మీడియా చిట్ చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి సూచన ప్రాయంగా చెప్పినట్టు తెలుస్తోంది.

